క్లుప్తంగా

రహదారి నిబంధనలు పాటించాలి

రామభద్రపురం: నూతన వాహన చట్టం ప్రకారం సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వి.ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఆయన శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నూతన చట్టాలు అమలు చేస్తామన్నారు.

5న చలో విజయవాడ

బాడంగి: కూటమి ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు తమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5న జరగనున్న మూడో కౌన్సిల్ చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీజీఈఏ తెర్లాం తాలూకా యూనిట్ కార్యదర్శి ఎస్ఎం బేగం పిలుపునిచ్చారు. స్థానికంగా విలేకరులతో ఆమె శనివారం మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై సభలో చర్చించి సీఎం, ఉప ముఖ్యమంత్రులకు వినతిపత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. కనీస వేతనాలు, ఆరోగ్య భద్రత వంటి సమస్యలపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

బాడంగి: రుతు పవనాలు ప్రవేశించి అధిక వర్షాలు పడతాయన్న కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ కె.సుధాకర్ సిబ్బందిని శనివారం ఆదేశించారు. భారీ వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున రైతులు మరింత అప్రమత్తంగా ఉండేలా వీఆర్‌వోలు రెవెన్యూ సహాయకులతో దండోరా రూపంలో ప్రచారం చేయాలని సూచించారు. వేగావతి నది పరివాహక ప్రాంతాల గ్రామాల వారు నదిలో రాకపోకలు సాగించొద్దని సూచించారు. గ్రామాల్లో విధిగా దండోరాలు వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు

రాజాం: పట్టణంలో తిరుమల కాంప్లెక్స్ వద్ద రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ 15వ ఆర్థిక సంఘం ద్వారా అభివృద్ధి పనులు నిమిత్తం ఈ నిధులు కేటాయించినట్టు కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. పలు సంస్థలకు వినియోగపడేలా ఇక్కడ రహదారిని నిర్మిస్తున్నామని, డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు.

పిల్ల కాలువలకు మహర్దశ



అంబకండి వద్ద కాలువలో జేసీబీతో పూడికల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్...


రేగిడి: మండలంలోని మద్దువలస పిల్ల కాలువలకు మహర్దశ పట్టింది. 24ఎల్ పిల్ల కాలువలో అధికారులు పనులు చేపట్టారు. గత నెల 27న పూడుకుపోతున్న కాలువలు అన్న వార్తను సాక్షి ప్రచురించడంతో అధికారులు స్పందించి కాలువల్లో జేసీబీల ద్వారా పనులు చేపడుతున్నారు. షట్టర్లు కూడా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వంగర: మండల పరిధి మద్దువలసలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రజలంతా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మద్దువలసతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

తొలకరి పలుకరిస్తున్నా... అన్నదాతకు అందని సాయం

బొబ్బిలి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాలకు సంబంధించి మే నెల చివరి నాటికి రైతులకు అప్పటి రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులను చేరవేసేవారు. రైతుల ఇళ్లకు వాలంటీర్లు, వ్యవసాయ సహాయకులు వచ్చి వారికి కావాల్సిన ఎరువులు, విత్తనాల ఇండెంటును తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదించేవారు. ఆ ప్రాప్తికి ఎరువులు, విత్తనాల బస్తాలు వారి ఇళ్లకు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలకు వర్షాలు కురవక ముందే వచ్చి చేరేవి. దీంతో రైతులు చాలా సంతోషంగా వాటిని తమ పొలాల్లో చల్లుకునేందుకు తీసుకెళ్లేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పరిస్థితి మారింది. రైతులకు పెట్టుబడి సాయం అందడం లేదు. విత్తనాలు చేరడం లేదు. దీంతో ఖరీఫ్‌లో ఏం చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు.



● నట్టేట ముంచారు



ఈ చిత్రంలోని కూరగాయలు పట్టుకుని కనిపిస్తున్న రైతులు బూసాయవలస గ్రామానికి చెందిన బూరుగు కృష్ణ. ఇతడు సీజన్ వారీగా వరితో పాటు కూరగాయల పంటలు సాగు చేస్తాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా రైతులకు అర్ధ రూపాయి కూడా సాయం చేయలేదు. ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని మాటిచ్చిన చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపారు. పెట్టుబడులు కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నమ్మి ఓటేసినందుకు నట్టేట ముంచారు.

– బూరుగు కృష్ణ,రైతు, బూసాయవలస, రామభద్రపురం మండలం

వ్యవసాయం దండగన్న వ్యక్తి ఏం చేస్తాడులే!



గతంలో వ్యవసాయం వలన ఏమీ రాదు మానెయ్యండని చెప్పిన వాడు మనకు ముఖ్యమంత్రి కావడం మా రైతులు చేసుకున్న ఖర్మ. అటువంటి వ్యక్తి రైతులకు ఏమయినా చేస్తాడంటే నమ్మే పరిస్థితులు లేవు. రైతులంతా మోసపోయాం.

– పెంట రాము, రాజుపేట, బొబ్బిలి మండలం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బొబ్బిలి నియోజకవర్గంలో రైతులకు వివిధ పథకాల ద్వారా అందిన లబ్ధి		
పథకం	లబ్ధిదారుల	లబ్ధి సంఖ్య (రూ.కోట్లలో...)
రైతు భరోసా	41,242	259.02
సున్నా వడ్డీ పంట రుణాలు	20,588	3.38
డాక్టర్ వైఎస్సార్ పంటల బీమా	5,535	140.77

అప్పులు చేయాల్సి వస్తోంది..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా నేటికీ రైతులకు సంబంధించిన ఏ విధమయిన సహాయ సహకారాలు ఇవ్వలేదు దీంతో పెట్టుబడులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఏమీ చేయలేక అప్పులు చేయాల్సి వస్తోంది. గతంలో ఖరీఫ్‌కు సీజన్‌కు సంబంధించి ఠంచన్‌గా రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. ఇప్పుడు పరిస్థితి దారుణంగా ఉంది.

– మెండి అసిరయ్య, రైతు, తెర్లాం

ఏమీ ఇవ్వకుండానే 15 శాతం గ్రోత్ ఉండాలట!

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కానీ, సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల బీమా వంటి పథకాలు ఏమీ ఇవ్వకుండానే వ్యవసాయంలో 15 శాతం వృద్ధి సాధించాలని వ్యవసాయాధికారులకు లక్ష్యాలను నిర్దేశించడంతో అధికారులు, రైతులు నివ్వెరపోతున్నారు.

తీవ్ర అసంతృప్తితో రైతులు



గతేడాది రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఎగ్గొట్టింది. రైతు భరోసా నిధులపై మంత్రి ఒక మాట, ముఖ్యమంత్రి ఒక మాట చెబుతున్నారు. తేదీపై స్పష్టత లేదు. ఇస్తారో.. ఇవ్వరో తెలియని సంకట స్థితిలో రైతులున్నారు. ఖరీఫ్ సీజన్ వచ్చి ఉన్నందున వెంటనే ప్రభుత్వం స్పష్టమయిన తేదీని ప్రకటించి కౌలు రైతులతో సహా రైతు భరోసా నిధులు ప్రకటించాలి

– ఎస్ గోపాలం, జిల్లా అధ్యక్షుడు, ఏపీ రైతు సంఘం, బొబ్బిలి

చెల్లింపులు చేయలేదు



చంద్రబాబు సీఎంగా వచ్చిన తరువాత పంటల బీమా కోసం ప్రీమియంలు వసూలు చేశారు. గతంలో ఉచితంగా ఉన్న ఈ పథకంలో చేరిన వారికి పరిహారాలు చెల్లించలేదు. ప్రస్తుతం వ్యవసాయం అంటే చాలా ఇబ్బందిగా ఉంది. పెట్టుబడి సాయం లేకపోవడం, ఇతర ప్రభుత్వ సహకారం లేకపోవడంతో నాకున్న పొలంలో కౌలుకు చేసేందుకు ఒక్కరూ ముందుకు రావడం లేదు.

–పొట్నూరు శంకరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సీపీఎం, బొబ్బిలి

ఎరువులు, విత్తనాలు కూడా సిద్ధం చేయలేదు

నాది కోడూరు. నాకు ఎకరన్నర పొలం వుంది. వరి సాగు చేస్తాను. ఖరీఫ్ సీజన్ ఆసన్నమైనప్పటికీ ఇప్పటి వరకు రైతుసేవా కేంద్రాలకు ఎరువులు, విత్తనాలు రాలేదు. విత్తనాలు వచ్చినా అరకొరగా వచ్చాయి. అవసరమైన మేరకు రాలేదు. గత ప్రభుత్వం రైతుభరోసాతో పెట్టుబడి సహాయంతో ఆదుకొంది. అన్నదాత సుఖీభవ డబ్బులు కూడా పడతాయన్న ఆశలేదు. బీమా కూడా లేదు. నష్టపరిహారాలు వస్తాయో లేదో తెలియదు.

– రెడ్డి కృష్ణ, రైతు, కోడూరు, బాడంగి మండలం



విత్తనాలేవి..

రాజాం మండలం పొగిరి సమీపంలో పొడి దుక్కులు చేసి విత్తనాల కోసం సిద్ధం చేసిన పొలాలు

- ఈ ఏడాది ముందుగానే తొలకరి జల్లులు
- విత్తనాల్లేక రైతుల ఎదురుచూపు

రాజాం: ఖరీఫ్ ఆసన్నమైంది. తొలకరి జల్లులు ముందుగానే కురుస్తుండడంతో రైతులు వరి నారుమడులకు సిద్ధమయ్యారు. మరో వైపు ఎద పంటలు పండించే రైతులు విత్తనాల కోసం పరుగులెడుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఇవేమీ పట్టకుండా వ్యవహరించడం, వ్యవసాయ శాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడంతో రైతుల్లో ఆందోళన ప్రారంభం అయ్యింది.

నియోజకవర్గంలో సాగు తగ్గే ప్రమాదం

గతేడాది వరకూ రాజాం నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాగు అధికంగా ఉండేది. రైతు భరోసా సాయం, సున్నా వడ్డీ రుణాలతో పాటు రకరకాల పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి ఆర్థిక సాయం అందేది. వీటికి తోడు రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు అందేవి. వీటిని రైతుల పాసుపుస్తకాలు ఆదారంగా నేరుగా రైతులకు ఇచ్చేవారు. ఈ ఏడాది ఇంతవరకూ ఈ విత్తన పంపిణీ వ్యవహారం ప్రారంభం కాలేదు. గతేడాది వరకూ నియోజకవర్గంలో 54 వేల ఎకరాల మేర ఖరీఫ్ వరి సాగులో ఉండగా, ఈ ఏడాది 50,600 ఎకరాలకే పరిమితమయ్యేలా కనిపిస్తుంది.

30 శాతం మేర మాత్రమే..

గతేడాది వరకూ నియోజకవర్గంలో సాగుచేసే వరి పంటకు సంబంధించి ఖరీఫ్‌లో 80 శాతం మేర విత్తన పంపిణీ ఉండేది. 45 శాతం మేర ప్రభుత్వం విత్తనాలు అందించగా, మిగిలిన 35 శాతం మేర ప్రైవేట్ ఫెర్టిలైజర్లు విత్తన పంపిణీ చేసేవారు. దీంతో రైతుకు పుష్కలంగా వరి విత్తనాలు అందేవి. వీటికి తోడు కొంతమంది రైతులు సొంతంగా విత్తనాలు తయారీ చేసి సాగు చేసేవారు. ఈ ఏడాది నియోజకవర్గంలో 15,600 క్వింటాళ్ల వరి విత్తనాలు రావల్సి ఉంది. ఇందులో వ్యవసాయశాఖ శాఖ కేవలం 30 శాతం మేర మాత్రమే విత్తనాలు పంపిణీ చేసే ఆలోచనలో ఉంది. 5.5వేల క్వింటాళ్ల వరి విత్తనాలు ప్రభుత్వం నియోజకవర్గానికి పంపిణీ చేస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు వెల్లడించారు. మిగిలిన వరి విత్తనాలు ఫెర్టిలైజర్ షాపులు వద్ద , మరికొన్ని విత్తనాలు రైతులు సొంతంగా తయారీ చేసుకోవల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఇంతవరకూ విత్తనాలు రాలేదు.



గతంలో ఈ సమయానికే విత్తన పంపిణీ ఉండేది. ఎటువంటి అట్టహాసం లేకుండా ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు అధికారులు వీఏఏలు ద్వారా అందించేవారు. దీంతో రైతు ముందుగానే ఖరీఫ్‌కు సన్నద్ధమయ్యేవాడు. ఇంతవరకూ ఎద పంటలు వేసుకునే రైతులకు సైతం విత్తనాలు సమకూర్చుకోలేని పరిస్థితి కనిపిస్తుంది.

– నక్క ఉమామహేశ్వరరావు, రైతు, బొద్దాం, రాజాం మండలం

విత్తన కష్టాలు తప్పేట్టులేదు



గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది విత్తన కష్టాలు తప్పేట్టు లేదనిపిస్తుంది. గతంలో విత్తనాలు సులభంగా లభించేవి. ఈ ఏడాది ఇంతవరకూ విత్తనాలు రాలేదు. మరో వైపు తొలకరి జల్లులు వచ్చేసాయి. విత్తనాలు వేసేందుకు పొలాలు సిద్ధంగా ఉన్నాయి. విత్తనాలు మాత్రం కనిపించడంలేదు.

– బూరి నారాయణరావు, రైతు, కొప్పర, వంగర మండలం.

కనీస సమాచారంలేదు.



గతంలో మా గ్రామానికి తెచ్చి రైతులకు విత్తనాలు ఇచ్చేవారు. ఇప్పుడు అంతకాపల్లిలో రైతు సేవా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఈ ఏడాది ఆ విత్తనాలు కూడా వచ్చేయో...రాలేదో తెలియదు. గాలిలో వాటంలా వ్యవసాయశాఖ తీరు కనిపిస్తుంది.

– దబ్బాద వెంకటరమణ, వీఆర్‌అగ్రహారం, రాజాం మండలం

వ్యాధుల పట్ల తస్మాత్...

రాజాం :

అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ అన్నారు. పట్టణంలో ఎస్సీ కాలనీ, వస్త్రపురి కాలనీ, అమ్మవారి కాలనీ ప్రాంతాల్లో శనివారం పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించారు. మురుగు కాలువల్లో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు కార్మికుల ద్వారా తొలగించారు. బ్లీచింగ్ వేసి శానిటేషన్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు వర్షా కాలంలో వచ్చే అంటు వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



ఎస్సీ కాలనీ సమీపంలో పారిశుధ్య పనులు చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకత

రామభద్రపురం: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై ఏడాది కాలంలోనే ప్రజా వ్యతిరేకత పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమం కన్నా అధికంగా ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో ఒక్కటి నెరవేరలేదన్న భావనకు ప్రజలు వచ్చారని చెప్పారు. నమ్మిన ప్రజలను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు అప్పికొండ లక్ష్మునాయుడు, బెవర ప్రసాద్, చింతల సింహాచలంనాయుడు, డర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

పొగ తాగడం ఆరోగ్యానికి హానికరం

రేగిడి: దూమపానం చేయడం ఆరోగ్యానికి హానికరమని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు. ప్రపంచ టొబాకో దినోత్సవం సందర్భంగా శనివారం రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పొగ తాగడంతో వచ్చే అనారోగ్యాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యం చక్కగా ఉండాలంటే దూమపానం, మద్యపానం వంటివి చేయకూడదని అన్నారు. దూమపానంతో ఊపిరితిత్తులు పాడవుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌టీ రమణ, సీహెచ్‌వో సుందరేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



దూమపానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

బోధనలో మెలకువలు పాటించాలి

బొబ్బిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పాటలు, పాఠాలు బోధించేటప్పుడు మెలకువలు పాటించాలని సీడీపీవో జె.విజయలక్ష్మి అన్నారు. పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పీపీ-1, పీపీ-2 పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఇందులో ఇంగ్లిష్, మాథ్స్, తెలుగు యాక్టివ్ బుక్స్ ఉన్నట్టు సీడీపీఓ తెలిపారు.

కౌలు రైతుల గుర్తింపు



మాట్లాడుతున్న ఏఓ కన్నబాబు

వంగర: గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏవో తట్టికోట కన్నబాబు సిబ్బందిని ఆదేశించారు. కొప్పరలో శనివారం గ్రామసభ నిర్వహించారు. కౌలు రైతుల గుర్తింపు కోసం ఫొటో, ఆధార్ కార్డు, ఒన్ బీ సమర్పించాలన్నారు. ఈ కార్డు 11 నెలలు కాల వ్యవధి ఉంటుందని, విత్తనాలు ఎరువులు రాయితీపై పొందవచ్చని, ఈ-క్రాప్ నమోదు చేసి ధాన్యం అమ్మకాలు చేయొచ్చన్నారు.

ఘనంగా నాగబంద విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహాలను ప్రతిష్ఠించిన భక్తులు

బాడంగి: మండలంలోని పిన్నవలస శివాలయ ప్రాంగణంలో నాగబంద విగ్రహాల ప్రతిష్ఠ శనివారం ఘనంగా జరిగింది. పార్వతీపురం పట్టణానికి చెందిన వేద పండితులు మురపాక రామదాసుశర్మ మంత్రోచ్చారణలతో ఎస్.ఐ.తారకేశ్వరరావు దంపతుల సౌజన్యంతో ప్రతిష్ఠ జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ నాగబంద విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ

రేగిడి: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కర్నేన హరికృష్ణ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ శనివారం పరామర్శించారు. హరికృష్ణ మృతికిగల కారణాలను సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు, సంకిలి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కెంబూరు గోపాలకృష్ణను అడిగితెలుసుకున్నారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, పాలవలస ధవళేశ్వరరావు, కింజరాపు సురేష్, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, సర్పంచ్ గార రమణ, తదితరులు ఉన్నారు.



హరికృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్, తదితరులు

సమయపాలన పాటించాలి

రాజాం సిటీ: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి పొగిరి గ్రామ సచివాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మనమిత్ర వాట్సాప్‌పై డోర్‌టుడోర్ సర్వే చేయాలని సూచించారు. అలాగే పెండింగ్ సర్వేలు, ఈకేవైసీ పూర్తి చేయాలని, ఈ సర్వీసుల మొత్తాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వ అకౌంట్‌కు జమ చేయాలని అన్నారు. యోగాంధ్ర మాసోత్సవంపై అవగాహన కల్పించడంతో పాటు తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

చదువుతో పాటు క్రీడలు అవసరం : డీఎస్పీ

బొబ్బిలి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఆత్మరక్షణ విద్యలను కూడా నేర్చుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో గెలుపొంది విజయం సాధించాలని అభిలషించారు. పోటీల్లో 200 మంది పాల్గొనగా విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం క్రీడాకారులు వరుసగా ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్టు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. వీరు ఈనెల 9 నుంచి మూడు రోజుల పాటు తాడిపత్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

సంక్షిప్తంగా...

పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరం

వంగర: పొగాకు వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలని, వినియోగిస్తే అనారోగ్యం పాలవుతారని సీహెచ్‌వో భవాని, ఏఎన్ఎం కృష్ణకుమారి అన్నారు. అరసాడలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రేగిడి: ప్రతీ రోజు యోగా చేస్తే మంచి ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో శ్యామలకుమారి ఉద్యోగులకు సూచించారు. మండలంలోని గురుకుల పాఠశాలలో యోగాంధ్రపై అన్ని శాఖల అధికారులకు శనివారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరు యోగాను తప్పనిసరిగా నేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్‌కుమార్, ఎంఈవో బి.ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీఓటీల శిక్షణ

బాడంగి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గత ఐదు రోజులుగా టీఓటీల ద్వారా నేర్పుతున్న యోగా ఆసనాల శిక్షణ తరగతులు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండల స్థాయి ఉద్యోగులు, సిబ్బంది, ఎంవోటీలు, టీవోటీలు పాల్గొన్నారు.

పుస్తకాల కిట్లు సరఫరా

వంగర: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను మండల కేంద్రం నుంచి శనివారం పాఠశాలలకు తరలించారు. ఈ ప్రక్రియను ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 3,688 మంది విద్యార్థులకు కిట్లు అందిస్తామని చెప్పారు.